క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బాబా విగ్రహాన్ని అలంకరించిన దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో షిర్డీసాయి బాబు ఆలయ 31వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయి భక్త మండలి సభ్యులు, సేవా సమితి సభ్యులు సంయుక్తంగా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తదనంతరం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జీకె రాము, సత్యనారాయణ రెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో వందశాతం ఉత్తీర్ణత



రామిశెట్టి హసన్య

గుంతకల్లు: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం సీబీఈఎస్ పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ఎస్. విజయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన దాదాపు 33 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా అందులో ఆరుగురు 90 శాతం మార్కులు, మరో 16 విద్యార్థులు 80 శాతంపైగా, మిగిలిన 11 మంది విద్యార్థులు 60 శాతంపైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థి రామిశెట్టి హసన్య 500 మార్కులకు 473 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు వివరించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు వచ్చే 10వ తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.నరేంద్రనాథ్ తెలిపారు. ఐటీఐలో కోపా, మెకానిక్ డీజిల్, డీఎం.సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్ వెహికల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులు అప్లికేషన్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను దగ్గర్లోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్ పత్తికొండ రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. మద్దికెర మండలం మదనంతరం గ్రామానికి చెందిన రంగస్వామి, ప్రసాద్ బైక్‌పై పని మీద గుత్తికి వచ్చారు. తిరిగి సొంతూరుకు వెళుతుండగా పత్తికొండ రోడ్డుపై ఎదురుగా వచ్చిన మరో బైక్ వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో రంగస్వామి, ప్రసాద్ గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వేసవి శిక్షణ ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చిత్రకారుడు శ్రీధరన్

గుంతకల్లుటౌన్: స్థానిక వన్‌టౌన్ పీఎస్ సమీపంలోని ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించినట్లు గ్రంథాలయాధికారి కమ్మన్న తెలిపారు. ప్రముఖ చిత్రకారుడు శ్రీధరన్ విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు కళలపై మక్కువ పెంచేందుకు గానూ పుస్తక పఠనం, చిత్రలేఖనముతో పాటు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది హేమలత, రాము పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. ఈ నెలలో అడ్మిషన్ చేసుకుంటే ఒక ఫీజు, జూన్ మాసంలో చేసుకుంటే ఒక ఫీజు ఉంటుందని తల్లితండ్రులకు మాయమాటలు చెబుతూ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పూర్తయ్యాయంటూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నగర నాయకులు హరికృష్ణ, రారాజు, షమీర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు చెక్

- తీరనున్న లో ఓల్టేజీ సమస్య
- రూ.7.50 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు
- 12659 వ్యవసాయ బోర్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా



పామిడి మండలం పాళ్యంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్

గుంతకల్లు: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టింది. ప్రధానంగా లో ఓల్టేజీ సమస్యను శాశ్వతంగా పోగొట్టేలా అడుగులు వేసింది. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందేలా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వివరాల్లోకెళితే.. నియోజకవర్గంలోని ఓబుళాపురం, మైనాపురం, మైనాపురం తండా, కొంగనపల్లి, అమీన్‌పల్లి, నరసాపురం, నక్కనదొడ్డి, గుండాల, గుండాలతండా, ములకలపెంట, గొల్లలదొడ్డి, ఎన్.తిమ్మాపురం తదితర గ్రామాలకు పాతకొత్తచెరువు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేది. అదేవిధంగా గుంతకల్లులోని సత్యనారాయణపేట ఏరియాలోని పలు వార్డులతోపాటు కసాపురం, దోసలోడికి, సంగాల తదితర గ్రామాలకు కసాపురం ఫీడర్ కింద, పామిడి మండలం ఎద్దులపల్లి ఫీడర్ కింద దాదాపు 6 పంచాయతీలకు విద్యుత్ సరఫరా చేసేవారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, ఇతర కారణాలతో అనేకమార్లు విద్యుత్ అంతరాయం ఉండేది. దీంతో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో గుంతకల్లు పట్టణంలోని సత్యనారయణపేట, మండలంలోని ఓబుళాపురం, పామిడి మండలంలోని పాళ్యంలో 133/11 కేవీ సబ్‌స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.2.50 కోట్లు చెప్పున రూ.7.50 కోట్లు కేటాయించారు. ఇప్పటికే గుంతకల్లు మండలం ఓబుళాపురంలో పనులు పూర్తయ్యాయి. అయితే గుంతకల్లు–గుత్తి రైలు మార్గం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో రైల్వే అధికారుల నుంచి అనుమతి రావాల్సి ఉంది. దీంతో ప్రారంభోత్సవం పెండింగ్ పడిందని ట్రాన్స్ కో అధికారులు చెబుతున్నారు. పామిడి మండం పాళ్యం విద్యుత్ సబ్‌స్టేషన్ కావడంతో మండలంలో లోఓల్టేజీ సమస్య తీరందని రైతులు చెబుతున్నారు. ఇక గుంతకల్లులోని సత్యనారాయణపేటలోని సబ్‌స్టేషన్ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

ఓల్టేజీ సమస్య పరిష్కారం..

విద్యుత్ లో ఓల్టేజీ సమస్య తీరేందుకు 132/11 కేవీ విద్యుత్ సబ్‌సేషన్లు కీలకం కానున్నాయి. లో ఓల్టేజీతో వ్యవసాయ విద్యుత్ మోటర్లు, ఇళ్లలో విద్యుత్ సామగ్రి దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సబ్‌సేషన్లు ఏర్పాటుతో ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వినియోగదారులు పేర్కొంటున్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోని గుంతకల్లు అర్బన్, రూరల్ 50,725 గృహ కనెక్షన్లు, గుత్తి టౌన్, రూరల్ పరిధిలో 23,583 గృహ కనెక్షన్లు, పామిడిలో 14,821 విద్యుత్ గృహ కనెక్షన్లు ఉన్నాయి. ఇక వ్యవసాయ విద్యుత్ సర్వీసులు గుంతకల్లులో 5355, గుత్తిలో 2536, పామిడిలో 4768 ఉన్నాయి. వీటితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా కమర్షియల్ విభాగం కింద 11,777, పరిశ్రమల కింద 362, ప్రభుత్వ కార్యాలయాలు కనెక్షన్లు 1,977 ఉన్నాయి.

రైతులకు మేలు



మా గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్‌తో ఇంతకాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య తీరుతుంది. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయింది. అయితే రైలు మార్గం(ట్రాక్) సమీపంలో ఉండడంతో వారి అనుమతుల కోసం పెండింగ్‌లో ఉంది. నాణ్యమైన విద్యుత్ సరఫరా కారణంగా పంటలకు సకాలంలో సాగునీరు పెట్టుకోవడానికి దోహదపడుతుంది.

– రమేష్‌రెడ్డి, సర్పంచ్, ఓబుళపురం, గుంతకల్లు మండలం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఓబుళాపురం సబ్‌స్టేషన్

నిరంతరాయంగా విద్యుత్



నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌తో మండలంలో నిరంతరంగా విద్యుత్ సరఫరా అవుతుంది. చాలా మేర విద్యుత్ కోతలు తగ్గాయి. గతంలో గృహ, ఇతర వినియోగదారులకు విద్యుత్ కోసం ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. అంతేకాకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది.

– నాగేశ్వరరెడ్డి, సొరకాయలపేట, పామిడి మండలం

చెరువులో పూడికమట్టి తొలగింపుపై రైతన్నల హర్షం



పుట్లూరు చెరువులో మట్టి పనులను చేపడుతున్న దృశ్యం

పుట్లూరు: ఉపాధి హామీ కింద పుట్లూరు చెరువులో పూడిక మట్టి తొలగింపు పనులను చేపట్టడంపై రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వర్షాలు సక్రమంగా రాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీరు రాకపోవడంతో గ్రామాల్లోని రైతు కూలీలు, రైతులు ఉపాధిహామీ పనులపై ఆధారపడ్డారు. ప్రస్తుతం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బాలాపురం, చింతలపల్లి, గోపురాజుపల్లి తదితర గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలకు చెరువులో పనులను కల్పించడం వల్ల పూడిక తొలగడంతో పాటు తొలగించిన మట్టిని రైతులు ట్రాక్టర్ల ద్వారా పొలాలకు తరలించుకుంటున్నారు. రైతులు, కూలీలకు ఉపయోపడే పనులను ఉపాధి హామీ కింద చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇజ్రాయెల్ మారణకాండను వ్యతిరేకించాలి



టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ నాయకులు

అనంతపురం అర్బన్: పాలసీనా ప్రజలపై ఇజ్రాయిల్ దేశం చేస్తున్న మారణకాండను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలంటూ ఎస్‌యూసీఐ(సీ) పార్టీ నాయకులు కోరారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి డి.రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి బీఎస్ అమర్‌నాథ్, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడారు. సామ్రాజ్యవాద, యుద్ధోన్మాద అమెరికా దేశం పూర్తి మద్ధతుతో జియనిస్ట్ ఇజ్రాయెల్ ఫాసిస్టు ప్రభుత్వం గత అక్టోబరు నుంచి పాలస్తీనా దేశ ప్రజలపై ముఖ్యగా గాజా ప్రాంతంలోని ప్రజలపై అమానుషంగా దాడులు చేస్తోందన్నారు. ఇప్పటికే 35 వేల మందికి పైగా మరణించారన్నారు. ఇందులో 14 వేలకు పైగా పసిపిల్లలు మరణించారని తెలిపారు. ఇజ్రాయెల్ ఆకృత్యాలకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నయాకులు తబ్రేజ్ ఖాన్, నాగముత్యాలు, మహేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి వెళ్లేందుకు అనుమతి లేదు



పుట్లూరు-తాడిపత్రి రోడ్డుపై ముళ్ల కంచె వేసిన దృశ్యం



పుట్లూరు మండలకేంద్రం సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్లూరు: తాడిపత్రికి వెళ్లాలంటే విద్యార్థులు, అత్యవసరమైన వారికి మినహా అనుమతి లేదు..దయచేసి వెనక్కి వెళ్లిపోవాలంటూ పుట్లూరు–తాడిపత్రి రోడ్డుపై బుధవారం ఉదయం నుంచే రోడ్డుపై ముళ్ల కంచె వేసి పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మంగళవారం తాడిపత్రిలో జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు, అత్యవసరంగా వెళ్లే వారిని మాత్రం అనుమతిస్తున్నారు. దీంతో వ్యాపారులు, చిరు ఉద్యోగులు, కార్మికులు చాలా మంది ఇబ్బందులకు గురయ్యారు.

రైతు ఆత్మహత్య

పుట్లూరు: మండల కేంద్రానికి చెందిన వేమన్నగారి రాజశేఖర్‌రెడ్డి(46) అనే రైతు అప్పుల బాధతో మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. పంటల సాగులో నష్టం రావడంతో అప్పులు తీర్చలేనని విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య రాజేశ్వరీ ఫిర్యాదు చేసిందన్నారు. ఈ విషయమై బుధవారం కేసు నమోదు చేశామని ఆయన వివరించారు. కాగా మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం.

బల్లిపడిన ఆహారం తిని అస్వస్థత

కూడేరు: ఉదిరిపికొండలో బల్లి పడిన ఆహారం తిని ఓ కుటుంబం అస్వస్థతకు గురైంది. వివరాలు.. గ్రామానికి చెందిన హుసేన్ పీరా కుటుంబం బుధవారం రాత్రి చికెన్ తిన్నారు. కొంత సేపటికే వారు అస్వస్థతకు గురయ్యారు. అనుమానం వచ్చి వంటలను పరిశీలించగా అందులో బల్లి కనిపించింది. వెంటనే హుసేన్ పీరా, భార్య రసూల్ బీ, పిల్లలు అభిబకాష్, జుబీదియా ఉరవకొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు.

మోస్తరు వర్షం

బొమ్మనహాళ్: మండలంలో మంగళవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. 13 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా సర్ ఆర్థర్ కాటన్ జయంతి



సర్ ఆర్థర్ కాటన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు రాజన్న మాట్లాడుతూ.. గోదావరి నదిని భారతదేశ అన్నపూర్ణగా.. దక్షిణ భారతేశ వర ప్రసాదినిగా మార్చిన ఘనత సర్ ఆర్థర్ కాటన్‌కే చెందుతుందని కొనియాడారు. ప్రజలకు సాగునీరు, తాగునీరు, విద్యుత్ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచారని తెలిపారు. మన ప్రాంత ప్రజల సంక్షేమానికి నిస్వార్థంగా కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఆంక్షలు.. రోగులకు ముచ్చెమటలు





ఆస్పత్రి వెనుకవైపు ట్రాఫిక్ జామ్, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో అంబులెన్స్‌లో గర్భిణిని వెనుక వైపు నుంచి లేబర్ వార్డుకు తరలిస్తున్న సిబ్బంది

- గర్భిణులు, దివ్యాంగులకు అవస్థలు
- ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అంబులెన్స్‌లు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పార్కింగ్ ఆంక్షలు రోగులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఆపద సమయంలో ఉన్న రోగులకు ప్రతి క్షణం ఎంతో అమూల్యమైనది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా రోగుల ప్రాణాలకే ప్రమాదం. అటువంటిది రోగులు, గర్భిణులను సకాంలో ఆయా వార్డులకు తీసుకెళ్లాలి. కానీ ఆస్పత్రి ఆవరణలోని ప్రవేశమార్గం, ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహం ముందున్న పలు చోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో గర్భిణులు, రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లేబర్ వార్డు వరకు అంబులెన్స్ వెళ్లే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ ప్రాంతంలో బారికేడ్ ఏర్పాటు చేయడంతో ఆస్పత్రి చుట్టూ అంబులెన్సులు ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. గతంలో అంబులెన్స్‌లో వచ్చిన గర్భిణులు ఆరుబయటే ప్రసవించిన దాఖలాలు లేకపోలేదు. రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు తీసుకున్న నిర్ణయం రోగులకు తలనొప్పిగా మారింది. ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యులు, స్టాఫ్‌నర్సుల వాహనాలు పార్కింగ్ చేయకూడదని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల సెక్యూరిటీ నోటిదురుసుతో కొంత మంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సంతకం చేసి వెళ్లే సమయంలో లోపలికి వాహనాలు పంపకపోవడాన్ని తప్పుబడుతున్నారు. ఇదెలా ఉన్నా.. అంబులెన్స్‌లకు దారి ఇచ్చేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. ఇదే విషయమై రెసిడెన్సియల్ మెడికల్ ఆఫీసర్లను సంప్రదించగా.. ఆస్పత్రి వెనుకవైపు నుంచి వాహనం తీసుకువస్తే సరిపోతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

కనుల పండువగా పెద్దమ్మ, మారెమ్మ జాతర



కమ్మూరులో బోనాలు తీసుకెళుతున్న గ్రామస్తులు

కూడేరు: కమ్మూరులో గ్రామదేవతలైన పెద్దమ్మ, మారెమ్మ అమ్మవార్ల జాతరను గ్రామస్తులు కనుల పండువగా జరుపుకున్నారు. బుధవారం గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో మంగళ వాయిద్యాల నడుమ బోనాలతో పెద్దమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ బోనాలలో తెచ్చిన తీపి పదార్థాలను అమ్మవార్లకు నైవేద్యంగా పెట్టారు. ఆలయ అర్చకులు పెద్దమ్మ, మారెమ్మ దేవతలకు క్షీరాభిషేకం చేశారు. తర్వాత వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు జంతు బలి దానం ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న రంగారెడ్డి, గ్రామ పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

బుగ్గ సంగమేశ్వర ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గ సంగమేశ్వర ఆలయంలో బుధవారం భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకలను లెక్కించారు. గతేడాది డిసెంబర్ 30 నుంచి ఇప్పటి వరకూ రూ.1,05,261 నగదును స్వామివారికి హుండీ కానుకల రూపంలో భక్తులు సమర్పించారు. అన్నదానం హుండీ ద్వారా రూ. 4,133 వచ్చినట్లు అధికారులు తెలిపారు. టెంకాయల విక్రయానికి నిర్వహించిన టెండర్ ద్వారా రూ.1.12 లక్షల ఆదాయం, బియ్యం బేడల సేకరణ టెండర్ ద్వారా కేజీ రూ.17.50 చొప్పున టెండర్ ఖరారైనట్లు ఆలయ ఈవో క్రిష్ణయ్య పేర్కొన్నారు.

నేరేడు చెట్లకు గడ్డి మందు పిచికారీ

శింగనమల: కొరివిపల్లిలో నేరేడు చెట్లకు గడ్డి మందు పిచికారీ చేశారు. బాధిత రైతు వివరాల మేరకు.. రైతు ఉల్లికల్లు బాలచౌడప్ప తన పొలంలో మూడెకరాల్లో ఐదేళ్ల క్రితం నేరేడు చెట్లు సాగు చేశాడు.

ప్రస్తుతం పూత, పిందెలున్నాయి. గుర్తు తెలియనివ్యక్తులు ఇటీవల నేరేడు చెట్లకు గడ్డిమందు పిచికారీ చేయడంతో పూత, పిందె రాలిపోయాయి. దీంతో రూ.1.50 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ మేరకు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బీరప్పస్వామి గుడిలో చోరీ

గుంతకల్లుటౌన్: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీబీరప్పస్వామి గుడిలో దొంగలు పడ్డారు. హుండీలో చేతులు పెట్టి అందినకాడికి దోచుకున్నారు. ఈ ఘటన బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. ఆలయ కమిటీ పెద్దలు బసప్ప తెలిపిన వివరాలు..కొన్ని నెలల నుంచి హుండీలో భక్తాదులు వేసిన కానుకల సొమ్మును లెక్కించలేదు. దీంతో హుండీలో డబ్బు నిండిపోయింది. దీన్ని పసిగట్టిన గుర్తు తెలియని దుండగులు గోడ దూకి ఆలయ ఆవరణలో ప్రవేశించి సుత్తితో హుండీని పగలగొట్టేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కకపోవడంతో అందిన కాడికి దొంగలించారు. ఉదయాన్నే ఆలయ పూజారులు హుండీలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతపురం నుంచి క్లూస్‌టీమ్ సిబ్బంది పలు వివరాలను సేకరించారు. రాతపూర్వకంగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ వెల్లడించారు.

ఇరువర్గాలపై కేసు

యాడికి: ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 13న కోనుప్పలపాడు గ్రామంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు చవ్వా గోపాల్ రెడ్డి, చవ్వా విష్ణువర్ధన్‌రెడ్డి, రామాంజనేయులు మరోవర్గానికి చెందిన బాలగంగయ్య, గంగిరెడ్డి, బాలకృష్ణతో పాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేశారు.

బండిశిల తిరునాల జయప్రదం చేయండి

పామిడి: రామరాజుపల్లిలో వచ్చే ఈనెల 22 నుంచి ఐదు రోజులపాటు జరిగే గ్రామ దేవతలు సుంకులమ్మ, ముత్యాలయ్య తిరునాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గ్రామ సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి బుధవారం కోరారు. చిలకమ్మ పల్లకీలో గ్రామ దేవతలు సుంకులమ్మ, ముత్యాలయ్య ఉత్సవ విగ్రహాల ఊరేగింపుతో తిరునాల ప్రారంభమవుతుందన్నారు. అక్కడి నుంచి బండిశిలపై గ్రామదేవతలను ఉంచి ఏడుగాండ్ల ఎద్దులతో లాగిస్తామన్నారు. ఈ గ్రామదేవతల చల్లని దీవెనలతోనే గ్రామం సుభిక్షంగా ఉందని తమ నమ్మకమని సర్పంచ్ తెలిపారు.

పీఏబీఆర్‌లో వాల్వ్ సమస్య

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ డ్యాంలో ఎయిర్ వాల్వ్‌లో లీకేజీ ఏర్పడటంతో తాత్కాలికంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగర పాలక సంస్థ ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, తదితర బృందం పీఏబీఆర్ డ్యాంను సందర్శించి సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా బుధవారం సాయంత్రం రావాల్సిన నీరు గురువారం నుంచి యథావిధిగా వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు.